

# వృషభ రాశి

## TAURUS

| ఆదాయం - 11 |
| --- |
| వ్యయం - 05 |
| రాజ్యపూజ్యం - 01 |
| అవమానం - 03 |

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4, మృగశిర 1,2 పాదాలలో జన్మించినవారు.**

**ఇ,ఉ,ఏ,ఓ,వ,వి,వు,వే,వో అను అక్షరములతో ప్రారంభమగు పేర్లు గలవారు**

**వృషభ రాశి వారి లక్షణములు :**

వీరిది పుష్టిగల శరీరం, గుండ్రని ముఖము, పొట్టి మెడ, తొడలు, పృష్టము విశాలముగా నుండును. ముఖము మీద గాని, వృష్టము మీదగాని, పార్శ్వ భాగమున గానీ పుట్టమచ్చ ఉండును. మూపురముండును. శరీరశిక్షణ, ఫుట్‌బాల్ వంటి ఆటలు ఆరోగ్యమును పెంచును. స్థిరత్వము, ఆనందము, వాత్సల్యము, దృఢత్వము, పెదవులపై చిరునవ్వు, నిజాయితీ, ఆప్యాయత, మంచి మనస్సు ఉండును. సంగీత సాహిత్యా భిలాషులు. వీరిలోని నిష్కల్మషమైన గుణము, మంచితనము, నమ్మకము కలిగించె స్వభావము ఎదుటివారిని ఆకర్షిస్తాయి. ఉన్నతాధికారులుగా నియమించినచో చక్కగా పనులు చేయింపగలరు. మధ్య వయస్సులోనూ, వృద్ధాప్యంలోనూ సుఖపడుదురు. ఎదుటివారిని ఆకర్షించగల శక్తిఎక్కువ. తండ్రిగానీ, తాతగానీ, అత్యంత ప్రతిభావంతులై ఉంటారు. పూర్వ బంధువులుందురు. వీరి వలన కుటుంబమునకు మంచిపేరు,ప్రతిష్ఠలు వస్తాయి. వ్యాపారంలో భాగస్వామ్యం పనికిరాదు. స్త్రీ ప్రియులు. ప్రేమ వ్యవహారాలలో చిక్కుకున్నచో, ఎదుటి వ్యక్తి చేతిలో కీలు బొమ్మ కాగలరు. ఒక యువతి చేత ఒకసారి ప్రభావితులైతే శక్తులన్నియూ వ్యర్థమై పోవును. చిన్న వయస్సులో వివాహమాడుట గానీ, ప్రేమ కలాపము గానీ, ఏదైనను మొదటి ప్రయత్నము విఫలమగును. 30ఏళ్ళ తర్వాత వివాహమాడినచో వైవాహిక జీవితం ఆనందమయమగును. ఈ రాశి స్త్రీలు బహు రూపవతులు. కళాత్మక దృష్టితో చిత్రములు, గృహోపకరణములు కంటికింపుగా ఏర్పాటు చేయుదురు. రుచిగల మధుర పదార్థములు తయారు చేయగలరు. విలాసముల కొరకు ఖర్చు చేయుదురు. పుత్రులు, పుత్రికలు కలిగి దీర్ఘాయుర్దాయము కలవారగుదురు. అబ్బాయిలకు-ప్రేమ వ్యవహారాల్లో నిజాయితీ కాస్తంత ఉధృతంగా ఉంటుంది. గుడ్డిగా ప్రేమిస్తారు. ప్రేమ,అభిమానాల విషయంలో ఎదురుదెబ్బ తగిలితే జీవితంలో కోలుకోలేరు. మనస్ఫూర్తిగా చేసే పొగడ్తలు అంటే ఇష్టం. కృత్తిక నక్షత్రం వారు భోజన ప్రియులు. తేజస్సు, ఇతరుల యందు ఆసక్తి కలిగి ప్రఖ్యాతి చెందుతారు. రోహిణి నక్షత్రము వారు స్థిరచిత్తులు, మధుర సత్యభాషణులు, శుచి కలిగి అందముగా నుందురు. మృగశిర నక్షత్రం వారు ఉత్సాహం, ధనము, భోగము కలిగి బాగా మాట్లాడుదురు. భయపడు స్వభావ ముండును. చపల చిత్తులు కానీ సమర్థులు. వీరి అదృష్ట సంఖ్య 1,2,5,6,9, శని, బుధ, శుక్ర, సోమవారములు కలసిన యోగించును.

### వృషభ రాశి వారి సంవత్సర ఫలితాంశము

ఈ సంవత్సరము ఈ రాశివారికి గురువు 6,7 స్థానములలో, శని 8వ స్థానములో, రాహువు 3,2 స్థానములలో, కేతువు 9,8 స్థానములలో ఉండుట వలన

నూతన వ్యవహారముల యందు అభివృద్ధి ఏర్పడుట, శ్రమకు తగిన ఫలితము కలుగుట, చేయు వృత్తి వ్యాపారాదుల యందు ఉన్నత స్థానము కలుగుట, కళాకారులకు అభివృద్ధి ఏర్పడుట, విద్యావంతులకు గుర్తింపులు వచ్చుట, విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశములు వచ్చుట, ఆకస్మిక ప్రయాణములు చేయవలసి వచ్చుట, స్థిరాస్తి విషయములలో వివాదములు ఏర్పడుట, అధికారము నిలుపుకొనుటక ధనము ఖర్చు చేయవలసి వచ్చుట, శుభకార్యక్రమ ప్రయత్నములు సఫలమగుట, దగ్గరి వారితో విభేదములు ఏర్పడుట, మీ పై ఇతరుల ఈర్ష్య అధికమగుట జరుగును. ఈ సంవత్సరము **ఈ రాశివారు సుందరాకాండ, మన్యుకల్ప పారాయణములు, అరటి పండ్లు, గంధం, తమలపాకులు, అన్నదానములు, కోతులకు ఆహారమందించుట** వలన శుభములు చేకూరును.

**ఏప్రియల్ :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం నూతన ప్రయత్నములు చేయుట, నూతన వ్యక్తులతో పరిచయములు ఏర్పడుట, ఆదాయము పెంపునకై ఆలోచనలు అధికము చేయుట, ఆకస్మికముగా కుటుంబ వ్యక్తులకు అనారోగ్యములు ఏర్పడుట, ధన నష్టములు ఏర్పడుట, ఆకస్మిక ప్రయాణములు చేయుట జరుగును.
**మే :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం చేయు వృత్తి వ్యాపారాదులలో సన్నిహితుల సహకారముతో లాభములు ఏర్పడుట, ఆర్థికపరంగా అనుకూలత ఉన్ననూ, ఆరోగ్యపరంగా లోపములు ఏర్పడుట, ముఖ్యమైన కార్యక్రమాలకు అతిథిగా వెళ్లుట, విందువినోదాలలో వస్తువులను పోగోట్టుకొనుట, తిరిగి కష్టతరముతో సంపాందించుకొనుట జరుగును.
**జూన్ :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం పనిభారము అధికమగుట, ప్రతిచిన్నపనిని ముందుండి నడిపించుట, కుటుంబ అభివృద్ధికై నూతన కార్యక్రమములు చేయుట, గౌరవమర్యాదలు పొందుట, ఉన్నతాధికారులతో కలసి ప్రయాణములు చేయుట, అనుకొని సంఘటనల వలన మానసిక అశాంతి ఏర్పడుట జరగును.
**జూలై :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం చేయువృత్తి వ్యాపారములయందు అనుకూలముగా ఉన్ననూ గృహముయందు ఏదోరకమైన సమస్యతో ఇబ్బందిపడుట, ఇంటికంటే బయటయందే అధికముగా కాలముగడుపుట, మిత్రులతో కలసి పెట్టుబడి వ్యవహారములకై చర్చించుట, చాలాకాలంగా పూర్తికాని పనులను పూర్తి చేయుట జరుగును.
**అగస్టు :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం గృహముయందు మార్పులు చేయుట, ఇతరుల గృహములయందు నివాసముందుట, ఆర్థికంగా రాబడియున్ననూ దానిని నిలుపుకోలేకపోవుట, దేవాలయ సందర్శనములు చేయుట, ఆడంబరముగా కనిపించాలని అనవసరపు ఖర్చులు చేయుట జరుగును.
**సెప్టెంబర్ :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం కుటుంబ వ్యక్తులకు అనారోగ్య సమస్యలు మెల్లమెల్లగా తగ్గుట, రక్షకభటులతో మనస్పర్ధలు వచ్చుట, కోర్టు వ్యవహారములలో చిక్కుకొనుట, ఆస్తిపంపకముల విషయములో నెమ్మదితనము లేకపోవుట వలన సోదరవర్గం వారితో విభేదములు ఏర్పడుట జరుగును.
**అక్టోబర్ :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం చేయువృత్తివ్యాపారాదులయందు స్థానచలనములు ఏర్పడుట, ఉన్నతాధికారులతో మన్ననలు పొందుటకై అనేక రకములుగా ప్రయత్నములు చేయుట, అనుకున్నదానిలో కొంతవరకు అనుకూలత ఏర్పడి ఉన్నత అధికారములు వచ్చుట, చిరకాల మిత్రులను కలుసుకొనుట జరుగను.
**నవంబర్ :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం నూతన వస్తువాహనాదులను కొనుగోలు చేయుట, దేవాలయాదులకు, ఆశ్రమాదులకు, సేవాసంస్థలకు తోచిన సహాయము అందించుట, మాసాంతమున ఇతరుల తప్పిదములకు మధ్యవర్తిత్వము చేసినందుకు మాటలుపడవలసి వచ్చుట జరుగును.
**డిసెంబర్ :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం దైవ కార్యక్రమాదులలో పాల్గొనుట, శుభకార్యక్రమములు చేయుటకు కుటుంబ వ్యక్తుల సహకారము తీసుకొనుట, కోర్టు వ్యవహారములయందు విజయము చేకూరుట, స్థిరాస్తుల కొనుగోళ్ళు చేయుట, మాసాంతమున ఇతరుల గొడవలలో తలదూర్చుట జరుగును.
**జనవరి :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం చేయువృత్తివ్యాపారాదులలో అభివృద్ధి ఏర్పడుట, ఖర్చులు తగ్గించుకొని ధనము నిల్వచేయుట, పితృమూలక ధనము చేతికందుట, ప్రముఖులతో మన్ననలు పొందుట, వాహనములను మార్చుట మొండి బకాయిలు వసూలు చేసుకొనుట జరుగును.
**ఫిబ్రవరి :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం శుభకార్యక్రమములు చేయుటయందు ప్రముఖ పాత్ర వహించుట, శుభమూలక ధనవ్యయములు అధికమగుట, ఆభరణములు కొనుగోలు చేయుట, బంధుమిత్రుల కలయికలు ఏర్పడుట, తూర్పు ఉత్తర ప్రాంతముల ప్రయాణములలో లాభములు చేకూరుట జరుగును.
**మార్చి :** ఈ నెలలో గ్రహస్థితి ఫలితానుసారం సన్నిహితుల సహకారముతో పనులన్ని పూర్తిచేయుట, శారీరక శ్రమ అధికమగుట, ఖర్చు ఎంత తగ్గించుకున్ననూ అంతకంతా ఖర్చు అగుట, నూతన వ్యాపారాదులలో భాగస్వామ్యం ఏర్పరచుకొనుట, ప్రయాణముల యందు నిద్రలేమితనముతో అనారోగ్యము ఏర్పడుట జరుగును.